

'నేను బడికి పోతా' అవగాహన ర్యాలీ



ర్యాలీలో మాట్లాడతున్న డిఇఒ బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండల కేంద్రంలో బడికి పోతా కార్యక్రమాన్ని మంగళవారం నేను ఎంఇఒ బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించారు. నుర్మతి జంక్షన్ నుండి మూడు రోడ్ల జంక్షన్ వరకు పలు పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా డిఇఒ పి బ్రహ్మాజీరావు మాట్లాడుతూ పాఠశాలలో విద్యాబోధన, మెనూ అమలు, ఇతరత్రా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు, విద్యార్థుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా సహించేది లేదని ఉపాధ్యాయులకు సూచించారు. బడి ఈడు పిల్లలందరిలో పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఏజెన్సీలోని ఉపాధ్యాయ పోస్టులన్నీ గిరిజనులకే కేటాయించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి - పాడేరు : మెగా డిఎస్సిలో ఏజెన్సీలోని అన్ని ఉపాధ్యాయ పోస్టులను శతశాతం గిరిజనుల తోనే భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ ధర్మన్న పడాల్ జిల్లా కార్యదర్శి పి బాల్‌దేవ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. మంగళవారం పాడేరులోని ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత పాఠశాలలో ఖాళీ టీచర్స్ పోస్టులను జనరల్ డిఎస్సిలో భర్తీకి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందదన్నారు. ఇందుల్లో ప్రభుత్వ మండల, జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో ఉన్న 16 వేల టీచర్స్ ఖాళీలు ఉన్నాయన్నారు.

గిరిజన గురుకులంలో ఉన్న ఖాళీలు భర్తీకి విద్య శాఖకు అనుమతి ఇవ్వలేదని, గిరిజన గురుకులం సొసైటీ ద్వారా భర్తీ చేయనున్నారన్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన జనరల్ డిఎస్సిలోనూ ఇదే నియామక ప్రక్రియ ప్రారంభించిందని, అప్పట్లో ఆదివాసీలంతా దీన్ని వ్యతిరేకించారని గుర్తు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం అదే విధానాన్ని అమలు చేస్తే గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. తక్షణమే ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాద్యాయ నియామకంలో నూరు శాతం రిజర్వేషన్ గిరిజనులకే అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

'జన్‌మన్'తో మెట్టపాలెం సమగ్రాభివృద్ధి

● ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్



గిరిజనుల చేపల వేట బోట్లు పరిశీలిస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి -అనంతగిరి : పిఎం జన్‌మన్ కింద ఎంపికైన మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ మెట్టపాలెంలో ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ మంగళవారం పర్యటించారు. పలుశాఖల అధికారులతో కలిసి పివిటిజి గిరిజనులైన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు, జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీటి కుళాయిలు, విద్యుత్ సదుపాయంకల్పిస్తామన్నారు. మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణానికి 20 సెంట్లు స్థలాన్ని కేటాయిస్తే గ్రామ సభ తీర్మానం చేసి భూమిని అప్పగించాలని చెప్పారు. అర్హులైన రైతులందరికీ పిఎం కిసాన్ పథకాన్ని వర్తింప చేస్తామన్నారు. గ్రామస్తులు వీడీవీకెను వద్దంటున్నారని, మేకలను మంజూరు చేయాలని కోరుతున్నారని ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలు లేని వారికి బ్యాంకు ఖాతాలు ఏర్పాటు చేస్తామన్నారు. వంతెన నిర్మాణానికి, రహదారి పనులకు రివైజ్డ్ శాంక్షన్ ఆర్డర్లను తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి సంబంధిత శాఖలలో అమలు చేస్తున్న పథకాలను మంజూరు చేస్తామని అన్నారు 7 విద్యుత్ స్థాంభలు ఏర్పాటు చెయ్యలని సూచించారు సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించింది లేనిది గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. నాటుపడవలు, వలలు, చేపలు నిల్వ చేసే బాక్సలు మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సిసి రోడ్డు, రచ్చబండ, సామాజిక భవనం, విద్యుత్ మీటర్లు, రహదారితోపాటు వంతెన నిర్మాణంకోసం స్థానికులు పిఒకు విన్నవించారు.

తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణంతో నిర్వాసితులైన వారి కష్టాలు, అదే రిజర్వాయర్‌లో చేపలవేటతో జీవనం సాగిస్తున్న పరిస్థితులపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వ జన్‌మన్ పథకంతో మెట్టపాలెం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని, అక్కడి గిరిజనుల జీవన స్థితిగతులు మెరుగుపరిచే చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా తాటిపూడి రిజర్వాయర్‌లో బోటులో కాసేపు పిఒ, ఇతర అధికారులు విహరించారు. సమావేశంలో పాల్గొన్న అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ఐటిడిఎస్ సహాయ ప్రాజెక్టు అధికారులు బిఎస్ ప్రభాకర్, ఎం వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ వేణుగోపాల్, గృహ నిర్మాణ శాఖ ఇఇ బి.బాబు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్ బిఎస్ నందు, తాహల్దార్ నాగ జ్యోతి, ఎంపిడిఒ నాగేష్, విద్యాశాఖ అధికారులు బాలాజీ, వివిధ శాఖల అధికారులు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సబ్యుడు కె .గోవింద్, గ్రామస్తులు శోభ, రాంబాబు. మధు, రాంబాబు పాల్గొన్నారు

గురుకులాల అవుట్‌సోర్సింగ్ టీచర్లను తక్షణమే రెన్యువల్ చేయాలి



మాట్లాడుతున్న, జిల్లా అధ్యక్షులు కొండబాబు,

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను తక్షణమే రెన్యువల్ చేయాలని ఎపి గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్ కొండబాబు, రాష్ట్ర నాయకులు జి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభమై 15 రోజులైనా నేటికి ఎపి గిరిజన సంక్షేమ గురుకులలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులను రెన్యువల్ చేయకపోవడం దుర్మార్గమన్నారు .రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2024 మెగా డిఎస్సిలో గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లు 1143స్థానాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న వారితోనే భర్తీ చేయాలన్నారు.2005 నుండి ఇప్పటివరకు గిరిజన సంక్షేమ గురుకులాలను నమ్ముకుని రాష్ట్రవ్యాప్తంగా 1633 మంది ఉన్నారని, అల్లూరి జిల్లాలో 450 మంది పని పనిచేస్తున్నట్లు తెలిపారు. మెగా డిఎస్సిలో 1143 పోస్టులను మినహాయించాలని, తద్వారా వారి జీవితాలకు భరోసానివ్వాలని కోరాఉరు. గురుకులాల అవుట్‌సోర్సింగ్ టీచర్లు పనిచేస్తున్న స్థానంలో రెగ్యులర్ టీచర్లను నియమిస్తే, ఇప్పటివరకు పనిచేస్తున్న వారి కుటుంబాలు రోడ్డున పడక తప్పదని ఆవేదన వెలిబుచ్చారు. ఈనెలాఖరులోగా అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను రెన్యువల్‌తోపాటు రెగ్యులర్ చేయాలన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ గురుకులం ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్ కొండబాబు, రాష్ట్ర నాయకులు జి రాజు, ఒ. పోతురాజు, పి రత్నకుమార్, త్రినాథ్, మోహన్ పాల్గొన్నారు.

వేతన వెతలు!



డిపిఎం కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రకృత వ్యవసాయ ఉద్యోగులు

- 17 నెలలుగా జీతాలకు నోచుకోని ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు
- కుటుంబపోషణ, ఇతర అవసరాలకు ఆర్థిక ఇబ్బందులు
- ఆందోళనకు సన్నద్ధం

ప్రజాశక్తి -పాడేరు: వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ నేచురల్ కమ్యూనిటీ ఫార్మింగ్(ప్రకృతి వ్యవసాయ విభాగం), రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) విభాగంలో పనిచేస్తున్న వివిధ కేడర్లలోని ఉద్యోగులు గత 17 నెలలుగా వేతనాలు అందని పరిస్థితి ఉంది.. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై తోడ్పాటు అందించే విధులను నిర్వర్తిస్తున్న వీరికి 2023 ఫిబ్రవరి నుంచి ప్రభుత్వం వేతనాలు మంజూరు చేయలేదు. వ్యవసాయంలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు, పెట్టుబడి లేని వ్యవసాయానికి తోడ్పాటు సేంద్రీయ ఎరువుల తయారీ విధానం వంటి ఎన్నో కార్యక్రమాలను నిరంతరం నిర్వర్తిస్తూ రైతులకు వెన్ను దన్నుగా నిలిచి సేవలందిస్తున్న వీరికి, నెలల తరబడి వేతనాలు అందక పోవడం వల్ల ఆర్థిక ఇక్కట్లను ఎదుర్కొంటూ ఆందోళన బాట పట్టారు రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం ఉద్యోగులు తమ వేతనాల మంజూరు కోసం ఆందోళనలు చేస్తున్నారు అల్లూరి జిల్లాలో పాడేరు, రంపచోడవరం డివిజన్లోని 22 మండలాల్లో సుమారు 850 మంది ప్రకృతి వ్యవసాయం ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరంతా వివిధ కేడర్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (ఐసిఆర్‌పి)గా యూనిట్ ఇన్‌ఛార్జిలుగా, మండల ఇన్‌ఛార్జిలుగా, నేషనల్ ఫార్మింగ్ యానిమేటర్స్ గా పనిచేస్తున్నారు.

క్యాడర్‌ను బట్టి ఒక్కొక్కరికి 17 నెలలకు గాను రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకు వేతన బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. తమ వేతన బకాయిల మంజూరు కోసం సిఐటియు ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వంతో చర్చలు జరిపి సంబంధిత శాఖ మంత్రికి, అధికారులకు మరోసారి విజ్ఞప్తులు చేసి, అనంతరం సమస్య పరిష్కారం కాకుంటే ఆందోళన చేపట్టేందుకు అన్ని మండలాల ఉద్యోగులు సమాయత్తమవు తున్నారు. ఇందులో భాగంగానే అల్లూరి జిల్లా కేంద్రంలో ఉన్న డిపిఎం కార్యాలయానికి రెండు రోజుల క్రితం ఉద్యోగులు వెళ్లి తాళం వేశారు.

వేతనాల్లో అప్రకటిత కోత



ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు వేతనాల చెల్లింపుల్లోనూ అన్యాయం జరుగుతోంది. ప్రతినెలా చెల్లించవలసిన జీతంలో అప్రకటితంగా ఒక్కొక్కరి నుంచి రూ.1500 నుంచి రూ.రెండు వేల వరకు కోత పెడుతున్నారు. జీతంలో కోత పెట్టడానికి కారణాలు చెప్పడం లేదు. ఇప్పటికైనా వేతన బకాయిచెల్లించి, తర్వాత రెగ్యులర్‌గా జీతం ఇచ్చే చర్యలు చేపట్టాలి.

- కొట్యాడ సన్యాసిరావు, జిల్లా అధ్యక్షుడు, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం, పాడేరు.

జిఒ3 ప్రయోజనాలను కాపాడాలి

- మంత్రి లోకేష్‌కు గిరిజన ఉద్యోగ సంఘం నేతల వినతి



మంత్రి లోకేష్‌తో గిరిజన ఉద్యోగ సంఘనేతలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాలకు ప్రత్యేక చట్టం చేసి, జిఒ3 ప్రయోజనాలు కాపాడాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి కోరారు. మంగళవారం అమరావతిలో రాష్ట్ర విద్యా, ఐటి, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ముందుగా మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం ద్వారా మాత్రమే షెడ్యూల్ ప్రాంతంలో శతశాతం ఉపాధ్యాయ పోస్టులు స్థానిక ఆదివాసులకు దక్కి న్యాయం జరుగుతుందని వివరించారు. దీనికి మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మన్యం జిల్లా, పోలవరం జెఎసి నాయకులు ధర్మారావు, ముక్కయ్య, రవి, మన్యం జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి గురుదొర ఉన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి

అధికారులకు ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, పాల్గొన్న ఇంజనీరింగ్ అధికారులు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మంగళవారం ఐటిడిఎ పిఒ తన ఛాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలలో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఏ స్థాయిలో ఉన్నాయి? బోర్లు, వాటర్ ట్యాంకులు ఎన్ని నిర్మిస్తున్నారో మండలాల వారీగా ఆరా తీశారు. పూర్తయిన భవనాలకు రంగులు ఏ విధంగా వేస్తున్నారు? నిర్మాణ పనులకు ఏ సిమెంట్ వాడుతున్నారు? ఇసుక ఎక్కడి నుంచి తెస్తున్నారు? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గోకుల పథకం ద్వారా నిర్మిస్తున్న పశువుల షెడ్లు ఒక్కొక్క మండలంలో ఎన్ని మంజూరయ్యాయి? ఎన్ని పూర్తి చేశారో తెలుసుకున్నారు. ఏజెన్సీలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ భవనాల పనులు ఏ దశలో ఉన్నాయి? జిసిసి స్టోర్స్ పనులు, గుడిసె పర్యటక కేంద్రంలో భవనాల నిర్మాణం ఏ దశలో ఉన్నాయో ఆరా తీశారు. ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన 75 పనుల పురోగతిపై గురించి, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని చింతలపూడి గ్రామ సమీపంలోని కాలువపై నిర్మిస్తున్న వంతెన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్ రాజ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గౌతమి, చైతన్య, నాగరాజు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, భాను, ఉమామహేశ్వరరావు, వీరభద్రరావు, ఎస్ఓ టి.మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పొగరాని పొయ్యిలు పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలం చావడి కోట పంచాయితీ పరిధి బొడ్లంక గ్రామంలో క్రాప్ జోన్ అగ్రో ఫారెస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మండల కోఆర్డినేటర్ గరిడె బాబూరావు ఆధ్వర్యాన సర్పంచ్ సాదల ప్రేమకుమార్‌రెడ్డి, మాజీ ఎంపిపి పల్లాల లక్ష్మిభూపతిరెడ్డి, మాజీ సర్పంచ్ ముర్ల కనక భూషణం చేతుల మీదగా గిరిజనులకు పొగరాని పొయ్యిలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ పొయ్యిల వల్ల ఆక్సిజన్ లెవెల్స్ అధికంగా ఉండడంతో పాటు తక్కువ పుల్లలను వాడకం వలన అడవిని కూడా రక్షించటానికి వీలుంటుందని పేర్కొన్నారు. ఈ పొయ్యిలను ఆదివాసీ బిడ్డలకు మాత్రమే కంపెనీ ఉచితంగా ఇస్తుందని, చావడి కోట పంచాయితీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పొగరాని పొయ్యిలు అందిస్తున్న క్రాప్ జోన్ ఆగ్రో ప్రతినిధులు




ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి -సీలేరు

వ్యాధుల నియంత్రణలో భాగంగా జీకే.వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధి దుర్గావీధి, అల్లూరి వీధి, శివాలయం, సిపిహెచ్ క్యాం, కన్నబ్బాయి క్యాంప్‌ల్లో దోమల నివారణకు మంగళవారం ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీలేరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ దుర్జో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని చింతపల్లి క్యాంప్, చంద్రపల్లి, లైకాన్‌పూర్ గ్రామాల్లో కూడా ఫాగింగ్ చర్యలు చేపడతామన్నారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం గతంలో అందజేసిన దోమతెరలను వినియోగించుకోవాలని కోరారు. ఇంటి ముందు మురుగు గుంతలను పూడ్చివేయాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలుషితమైన ఆహారం కాకుండా పరిశుభ్రమైన ఆహారాన్ని తినాలని కోరారు.



విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సరోజిని తదితరులు

విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి అన్నవరం, ఉమ్మడివరం గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులను పంచాయతీ సర్పంచ్ పూనం సరోజినీ, స్కూల్ కమిటీ చైర్మన్ ఎం.కన్నారావు, హెచ్ఎంలు పి.నాగమణి ఓ.మంగారావురెడ్డి, సిపిఎం నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజినీ మాట్లాడుతూ బాల్యం నుండే చదువులు సక్రమంగా కొనసాగితే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. ఏ ఒక్క విద్యార్థీ డ్రాపౌట్ కాకుండా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మెనూ సక్రమంగా, నాణ్యతగా అమలు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వర్షాలు మొదలైన నేపథ్యంలో సీజన్లో వచ్చే వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఒకటే తరగతి గది ఉండడంతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పిల్లలందరినీ ఒక దగ్గరే కూర్చోబెట్టి చదువు చెప్పటం వలన వారికి పాఠాలు అర్థంకాని పరిస్థితి నెలకొందని, తక్షణమే ఉన్నత అధికారులు స్పందించి వేరే తరగతి గదులు నిర్మించాలని కోరారు. వంట షెడ్ లేకపోవడంతో ఆరుబయటే వంట చేయాల్సి వస్తుందని, రెండు పాఠశాలలోనూ ఇదే పరిస్థితి ఉందని, వంట షెడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ తరుణ్, మహిళ పోలీస్ సాయి కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.



లక్ష్మిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

విఐటి వర్సిటీలో రాజవొమ్మంగి విద్యార్థినికి సీటు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2022-24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపులో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన రేణుక లక్ష్మికి విఐటి అమరావతి విశ్వవిద్యాలయంలో సీటు వచ్చిందని రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.శిరీష తెలిపారు. ఈ మేరకు రేణుక లక్ష్మిని ఆమె తల్లిదండ్రులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు మంగళవారం అభినందించారు.



బస్ పాస్‌లకు దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్టీసీ అధికారులు

బస్ పాస్‌లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని బస్టాండ్ సెంటర్‌లో ఎపిఎస్ఆర్‌టిసి గోకవరం డిపో అధికారులు వివిధ రకాల బస్ పాస్‌ల కోసం మంగళవారం దరఖాస్తులు స్వీకరించారు. వికలాంగుల బస్ పాస్‌లకు 43, విద్యార్థుల ఫ్రీ బస్ పాస్‌లకు 83, స్టూడెంట్ మనీ పాసులకు 40, మొత్తం 166 దరఖాస్తులు వచ్చాయి. వాటిని డిపోకి తీసుకొని వెళ్లి పాస్‌లు చేసి నాలుగు రోజుల్లో తీసుకొస్తామని ఆర్టీసీ గోకవరం డిపో అధికారులు తెలిపారు. ఎఎస్‌డిఎస్ శబరి వికలాంగుల సంఘం రవి, కూనవరం గ్రామస్తులు ఎంవివి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ కోఆర్డినేటర్ ఎంఎంఎస్, నల్ల వీరబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		



ట్రాక్టర్లు అందజేస్తున్న ఎంపిపి ఈశ్వరి, జెడ్‌పిటిసి జానకమ్మ

పారిశుధ్య పనులకు ట్రాక్టర్ల పంపిణీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పంచాయతీలకు ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్నట్లు స్థానిక ఎంపిపి బి.ఈశ్వరి, జెడ్‌పిటిసి సిహెచ్ జానకమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జయ ఉమా ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మండలంలోని గసభ, గుంటసీమ, కించుమండ, పోతంగి పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్లను ఆయా పంచాయతీల సర్పంచ్‌లకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలతో పలు రకాల వ్యాధులు ప్రబలుతున్నాయని, ఈ నేపథ్యంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద గ్రామాల్లో చెత్తను సేకరించి, డంపింగ్‌యార్డులకు తరలించేందుకు ఈ ట్రాక్టర్లను అందదజేసిందన్నారు. మండలంలో18 పంచాయతీలు ఉండగా, ప్రస్తుతం మొదటి విడతలో నాలుగు పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరయ్యాయన్నారు. వీటిని నాలుగు పంచాయతీలే కాకుండా ఇతర పంచాయతీల్లో కూడా సర్దుకుని గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్ ఆనంద్, గసభ సిపిఎం సర్పంచ్ పి సునీత, కించుమండ సర్పంచ్ హెచ్‌బి చెల్లమ్మ, మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, ఎంపిటిసి జమ్మ, ఇన్చార్జి ఇఒపిఆర్‌డి విజయ్ కుమార్, పశుసంవర్ధక శాఖ జిల్లా డైరెక్టర్ ఎం శ్రీరాములు, వైసిపి నాయకులు బి సింహాచలం, హెచ్‌బి బాబూరావు, సర్పంచ్ వెంకటరావు, చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇద్దరు బాల కార్మికుల గుర్తింపు

దుకాణ యజమానిపై కేసు



ప్రజాశక్తి -జి మాడుగుల : బాల కార్మికుల నిర్మూలన ఉత్సవాల్లో భాగంగా అల్లూరి జిల్లా బాల కార్మికుల విభాగం ఇన్‌స్పెక్టర్ టి.సుజాత ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు, ఈ తనిఖీల్లో రాజస్థాన్ స్పెషల్ జిలాబి హోటల్లో 14ఏళ్లలోపు వయస్సున్న ఇద్దరు బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించి, యజమానిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు,. దుకాణ యజమానిక కోర్టుకు హాజరు కావాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల కార్మికులతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని, పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరిచంఆరు. కార్యక్రమంలో కార్మికశాఖ సహాయ అధికారి పి సూర్యనారాయణ పాల్గొన్నారు

విత్తన శుద్ధిపై అవగాహన

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామంలో బీజామృతంతో విత్తనశుద్ధిపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. రైతులతోనే విత్తన శుద్ధి చేయించారు. ఇలా విత్తన శుద్ధి చేయడం వల్ల రైతులు వేసిన పంటలకు తెగులు రాకుండా ఉంటాయని ఎన్ఎఫ్ఎ ప్రతినిధి బాలమణి, ఐసిఆర్‌పి మీన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తోనంగి అప్పలనాయుడు, చందక వెంకట్రావు, కొంగరాన ఎర్నాయుడు, గొలగాని సత్యనారాయణ, జామి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమాతో కుటుంబానికి భరోసా

పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్



బీమా చెక్కును అందజేస్తున్న పిఒ, పోస్టల్ అధికారులు

ప్రజాశక్తి -అరకులోయ : పోస్టల్ బీమాతో ప్రతి కుటుంబానికి భరోసా కలుగుతుందని పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన పెదబయలు మండలం జిటిడబ్ల్యూ స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు కుటుంబానికి అరకు సబ్ పోస్ట్‌ఆఫీస్‌లో ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా రూ.10 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును పిఒతో కలిసి పోస్టల్ శాఖ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా పిఒ అభిషేక్ మాట్లాడుతూ, బీమా అనేది కష్టకాలంలో బాధిత కుటుంబానికి భరోసాగా ఉంటుందన్నారు. పోస్టల్ బీమా చేసిన వారం రోజుల్లోనే ప్రమాదంలో మృతి చెందిన పెదబయలు రికార్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు కుటుంబానికి రూ.10 లక్షల బీమా మంజూరైందన్నారు.

కేవలం రూ.399 ప్రీమియంతో బీమాలో చేరడం ద్వారా బాధిత కుటుంబానికి రూ.పది లక్షల ఆర్థికభరోసా లభించిందన్నారు. ఉద్యోగులు, కార్మికులు పాత్రికేయులు, గిరిజనులు, ఇలా ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోస్టల్‌బీమాపై ఐసిడిఎస్, మండల పరిషత్, అంగన్వాడీలు, పోస్టల్‌అధికారులు, సిబ్బంది గ్రామాల్లో రైతులకు ఉద్యోగులకు, బీమా సౌకర్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. పోస్టల్‌శాఖ అంటే కేవలం ఉత్తరాలు, మనియార్డర్లు అని ప్రజల్లో ఉందని, అలాకాక బీమా సౌకర్యంతోపాటు ఎన్నో ప్రయోజనాలున్నాయని, ఆయా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు తపాల శాఖలో బీమా సౌకర్యం, సుకన్య యోజన పథకాలు సద్వినియోగం చేసుకోవాలనికోరారు. ఈ సందర్భంగా అరకు సబ్‌డివిజన్‌లో ఉత్తమసేవలు అందించిన గ్రామీణ తపాలా ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ కు పోస్టల్ శాఖ అధికారులు జ్ఞాపికను బహూకరించారు. అరకులోయ ఐపిఒ బి. ఉపేంద్ర అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. ఎస్.యు నాగేశ్వరరెడ్డి, ఎంపిడిఒ వెంకటేష్, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పి. దాసుబాబు, పంచాయితీ ఈవో రాజకుమార్, ఐపిపిబి సీనియర్ మేనేజర్ శ్రీదేవి, సిడిపిఒ కే.శారద, మెయిల్ ఓవర్సీస్ ఎం.శ్రీను, గోపాల్ పడాల్, నాలుగు మండలాల పోస్టల్ సిబ్బంది ు పాల్గొన్నారు,

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



హుకుంపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐ

ప్రజాశక్తి -హుకుంపేట: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం చెడు వ్యసనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హుకుంపేట సిఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు చెడు వ్యసనాలకు దూరంగాఉండాలని, ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వీటిని తీసుకోవడం, అమ్మడం, రవాణా ఇలా ఏదైనా చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై 9381123100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే సమాచారం అందించాలన్నారు. పాఠశాలలో వున్న సదుపాయాలను ఉపయోగించుకొని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. చెడుఅలవాట్లకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సతీష్, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

జి.మాడుగుల : మండలంలోని పాలమామిడి గ్రామాన్ని స్థానిక సిఐ రమేష్ మంగళవారం సందర్శించారు గ్రామస్తులతో మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, నాటుసారా తయారీ,అమ్మకాలు చట్టరీత్యా నేరమని అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు, ముఖ్యంగా యువకులు మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువతీ యువకులు చదువుకోవాలని, బడి బయట తిరిగే పిల్లలను గుర్తించి, పాఠశాలకు పంపించే ఏర్పాటు పెద్దలు చేయాలని కోరారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తమకు తెలియపరిస్తే పోలీసుశాఖాపరంగా సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటామన్నార.



హుకుంపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐ

డుంబ్రిగుడలో భారీ వర్షం

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండల కేంద్రంతో పాటు కించుమండలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములుచమెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా రోడ్లు పూర్తిగా జలమయంగా మారాయి. మండల కేంద్రంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద మురుగు కాలువల్లోని నీరు గుంటసీమ రోడ్డుపైకి చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో మురుగునీరు ఇళ్లల్లోకి చేరడంతో స్థానికులు అవస్థలు పాలయ్యారు. వివిధ పనుల నిమిత్తం మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తిరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు.

నేరాలు ఘోరాలు



గంజాయితో పట్టుబడిన నిందితులు

గంజాయితో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని డముకు వ్యూ పాయింట్ చెక్ పోస్ట్ వద్ద మంగళవారం వాహన తనిఖీ చేస్తుండగా అరకు నుండి విశాఖకు స్కూటిలో తరలిస్తున్న రెండు కేజీలు గంజాయిని పట్టుకున్నామని ఎస్ఐ రాము తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. చింతపల్లి అప్పలరాజు గుంట భరత్, డుంబ్రిగుడ మండలం, గసభ పంచాయతీ, అడ్రగుడ గ్రామానికి చెందిన కిల్లో రాజు అనే ముగ్గురు వ్యక్తులు ఎపి 39 ఎస్‌కె 5469 నంబర్ గల స్కూటీపై గంజాయిని విశాఖపట్నం తరలిస్తుండగా సిబ్బందితో పట్టుకొని, అరెస్ట్ చేయగా, న్యాయమూర్తి విశాఖ సెంట్రల్‌జైల్‌కు రిమాండ్ విధించారన్నారు.



అనాథ పిల్లలకు స్కూల్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఐక్య సంస్థ ప్రతినిధులు

అనాథ పిల్లలకు స్కూల్ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి- అరకులోయ : అరకులోయలోని నవజీవన అనాథ అశ్రమం పిల్లలకు అరకులోయ ఐక్య సంస్థ ఆధ్వర్యంలో రూ. 30 వేల విలువైన బుక్స్, పెన్స్, పెన్సిల్స్, రైస్ బాగ్స్, స్టీల్ గ్లాసెస్ తదితర నిత్యవసర సామాన్లు పంపిణీ చేశారు. 1999- 2000 విద్యా సంవత్సరంలో అరకులోయ ప్రభుత్వ హైస్కూల్లో 10వ తరగతి విద్యానిభ్యసించిన పూర్వ విద్యార్థులు కల్లూరి లక్ష్మీనారాయణ, అల్లిన సతీష్ కుమార్, తవ్వ సతీష్ గుప్తా, బండి శ్రీనివాస్ గుప్తా ,కాపుగంటి సుమన్, బుజ్జి బంగారు రాజు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా తమ వంతు బాధ్యతగా సమాజానికి ఉపయోగపడాలన్న ఉద్దేశంతో ఐక్య సంస్థను నెలకొల్పారు. ఈ సంస్థ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే పేద, అనాథ పిల్లలకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

ఖైదీల మానసిక స్థితిపై సమీక్ష

ప్రజాశక్తి - ఆరిలోవ : ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, వారి మానసిక స్థితిగతులపై మంగళవారం కేంద్రకారాగారంలో సమీక్ష నిర్వహించారు. జిల్లా మానసిక సమీక్ష బోర్డు చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి.రామారావు, ప్రజ్వల ప్రతినిధి ఎ.సుచిత్ర, మానసిక వైద్య ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ కెవి.రామిరెడ్డి హాజరై సమీక్ష చేశారు. ఖైదీలకు నిరంతరం మానసిక వైద్యం అందుబాటులో ఉండాలంటే మానసిక వైద్య నిపుణుడు ఉండాలని వారు సూచించారు. ఈ సమావేశంలో కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్ కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



డొంకరాయి జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

గోదావరి డెల్టాకు అదనంగా నీరు విడుదల

ప్రజాశక్తి-సీలేరు : జలవనరుల శాఖ అధికారులు విన్నపమేరకు సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు అదనంగా 2000 క్యూసెక్కుల నీటిని సోమవారం సాయంత్రం నుంచి విడుదల చేస్తున్నట్లు ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాస్తవానికి డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం పవర్ కెనాల్ ద్వారా 4000 క్యూసెక్కులు నీరు గోదావరి డెల్టాకు వెళుతుండగా, అదనంగా రబీ పంటకు నీరు విడుదల చేయాలని జల వనరుల శాఖ అధికారులు కోరారని తెలిపారు. ఈ మేరకు జెన్కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం నుంచి నీటి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. మూడు రోజులపాటు డొంకరాయి నుంచి 2000 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తామని, తరువాత రెండు రోజులు 1500 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తామని తెలిపారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో ఎపి వాటాతో పాటు డొంకరాయి జలాశయంలో కలిపి 12.5 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నాయని ఎస్ఇ వెల్లడించారు.

వర్షానికి కారిపోతున్న ఆర్టీసీ బస్సులు

- కాలం చెల్లిన సర్వీసులతో ఇబ్బందులు



తడుస్తూనే పనిచేస్తున్న డ్రైవర్

ప్రజాశక్తి - సీలేరు : ఘాట్ రోడ్డులో కాలం చెల్లించిన బస్సులు నడపడంతో తరచూ అడవి మధ్యలో మరమ్మతులకు గురై ఆగిపోవడం, వర్షం పడితే కారిపోవడం జరుగుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖపట్నం నుండి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే అల్ట్రా డీలక్స్ నైట్ సర్వీస్ బస్ సోమవారం సాయంత్రం 6 గంటలకు నర్సీపట్నం వచ్చేసరికి భారీ స్థాయిలో వర్షం కురుస్తుంది. ఈ సమయంలో నర్సీపట్నం కాంప్లెక్స్‌లో బస్సును నిలవగానే వర్షపు నీరు క్యాబిన్ పైనుంచి బస్సు లోపలకు కారిపోవడంతో ప్రయాణికులు తడిసి ముద్దయ్యారు. ఆర్టీసీ అధికారులు అల్ట్రా డీలక్స్ పేరుతో కాలం చెల్లిన బస్సులు నడుపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాలకు, అందులోనూ ఘాట్ రోడ్డులో నడిచే బస్ సర్వీసుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా చలనం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి విశాఖపట్నం నుంచి భద్రాచలం వరకు అల్ట్రా డీలక్స్ బస్ సర్వీసులు పాత వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేసి ప్రయాణికులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల సిబ్బంది శ్రద్ధ చూపాలని రాజవొమ్మంగి పిహెచ్‌సి వైద్యాధికారి సుష్మ అన్నారు. మంగళవారం కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించి 169 మంది బాలికలకు మలేరియా రాపిడ్, హిమాగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న పిల్లలకు ప్రతేక పోషకాహార మెనూ అందించాలని ప్రిన్సిపాల్‌కు వైద్యాధికారి సుష్మా సూచించారు. కళాశాల పరిసరాలను, డ్రైన్లు, వంటశాలను పరిశీలించారు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ సోమరాజు రెడ్డి, హెచ్‌వి లక్ష్మమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ తమ్మారావు, ఏఎన్ఎంలు సత్యవతి, రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్లు నానిబాబు, లక్ష్మయ్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లపై బాబు పునరాలోచన

- కొనసాగింపుపై కూటమి ఎమ్మెల్యేలు అభ్యంతరం
- కొత్త మార్గదర్శకాలతో తొలగింపు యోచన
- పింఛన్ల పంపిణీ బాధ్యత తప్పింపుపై వాలంటీర్లలో ఆందోళన



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

వాలంటీర్లను కొనసాగించి, రూ.10 వేలకు వారి జీతం పెంచుతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో వాలంటీర్ల కొనసాగింపు, జీతం పెంపు విషయమై మాట్లాడలేదు సరికదా.. సచివాలయ ఉద్యోగులతో పింఛన్ సొమ్ము పంపిణీ చేయాలని నిర్ణయించారు. జులైలో ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము ఇచ్చే బాధ్యత నుంచి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్లను తప్పించింది. ఆ పనిని సచివాలయ ఉద్యోగులకు అప్పగించడంతో వాలంటీర్లు తమను కొనసాగిస్తారో, లేదోనని ఆందోళన చెందుతున్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ప్రభుత్వ కార్యక్రమాలు, పింఛన్ పంపిణీ బాధ్యతలో వాలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ పేర్కొంది. అప్పటి నుంచి సచివాలయాలకు వెళ్లి హాజరు వేసుకొని రావడం తప్ప ప్రభుత్వ కార్యకలాపాలకు వాలంటీర్లు దూరంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినా వారిని కొనసాగించే విషయమై స్పష్టత ఇవ్వకపోవడంతో ప్రస్తుతానికి హాజరు నమోదు చేసుకున్న వారికి జీతాలు చెల్లిస్తున్నారు.

జిల్లాలో 522 సచివాలయాల పరిధిలో 9,132 మంది వాలంటీర్లను గత ప్రభుత్వం నియమించింది. వీరిలో సార్వత్రిక ఎన్నికల ముందు 5002 మంది రాజీనామా చేయడంతో ప్రస్తుతం 4,130 మంది వాలంటీర్లు కొనసాగుతున్నారు. రాజీనామా చేసిన వారికి జీతాలు ఆపేశారు. రాజీనామా చేసిన వాలంటీర్లు మళ్లీ తమను పునరుద్ధరించాలని కోరుతున్నా తీసుకొనే పరిస్థితి కానరావడం లేదు. ఎన్నికల ముందు వాలంటీర్ల జీతం రెట్టింపుచేసి, కొనసాగిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినా అందుకు కూటమి ఎమ్మెల్యేలు అంగీకరించడంలేదని తెలిసింది. గత ప్రభుత్వంలో నియామకమైన వాలంటీర్లు వైసిపికి చెందిన వారు కావడంతో వారందరినీ తొలగించి కొత్తగా తమ వారిని తీసుకోవాలని కూటమి ఎమ్మెల్యేలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మంత్రులు కూడా ఎమ్మెల్యేల సూచనలపై సానుకూలంగా స్పందించడంతో సోమవారం జరిగిన మంత్రివర్గంలో వాలంటీర్ల కొనసాగింపు అంశంపై నిర్ణయం ప్రకటించకుండా ప్రభుత్వం వాయిదా వేసింది.

వైసిపి ప్రభుత్వంలో నియమితులైన వాలంటీర్లను కొనసాగిస్తే.. తమ మాటకు విలువలేకుండా పోతుందని, అందుకని వాలంటీర్ల కొనసాగింపు విషయమై ఆలోచించాలని ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో చంద్రబాబు పునరాలోచనలోపడ్డారు. భవిష్యత్తులో ప్రస్తుతం పనిచేస్తున్న వాలంటీర్ల పనిపై కొన్ని మార్గదర్శకాలు రూపొందించి క్రమంగా తప్పించాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది.

ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకంపై హర్షం

ప్రజాశక్తి-కూనవరం : రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకానికి సంబంధించిన ఫైల్‌పై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తొలి సంతకం చేయడం పట్ల ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని కోతులగుట్టలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో గతంలో ఎంతోమంది ఆరోగ్య కార్యకర్తలుగా పని చేశారని, వారిని గత ప్రభుత్వం తొలగించిందని, దీంతో వారంతా నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి ప్రస్తుతం ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకాల్లో మొదటి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ఆశ్రమ, గురుకుల విద్యాలయాల్లో వీరంతా చాలీచాలని జీత భత్యాలతోనే 24 గంటలు పని చేస్తూ విద్యార్థులను కంటికి రెప్పలాగా చూసుకునేవారని తెలిపారు. గతంలో ఆరోగ్య కార్యకర్తలుగా పని చేసిన వీరికి విద్యార్థులతో ఎలా ఉండాలనే అవగాహన ఉందని, కావునా వారినే తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ జెఎసి చింతూరు డివిజన్ ఉపాధ్యక్షులు వేటకాని మల్లయ్య, ఆరోగ్య కార్యకర్తలు చిచ్చడి రాములమ్మ, ధర్ముల శాంతికుమారి, సోమిని రాజేశ్వరి, కారం రాములమ్మ, కణితి శ్రీదేవి, సవలం శుభశ్రీ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సి, భవిత కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం : చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, ఎటపాక, కూనవరం, విఆర్.పురం మండలాల్లోని ఎంఆర్‌సి, భవిత కేంద్రాలను ఎఎంఒ కె.భాస్కరరావు మంగళవారం సందర్శించారు. ఎంఆర్‌సిలో సిఆర్‌పిలతో సమావేశం నిర్వహించి 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు సూచనలు చేశారు. నాలుగు మండలాల్లోని భవిత సెంటర్లను సందర్శించి అక్కడ పనిచేస్తున్న ఐఇఆర్పిలు, ఎన్రోల్ మెంట్ డ్రైవ్ ద్వారా ఎంతమంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలలో చేర్పించారో వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి తగిన సూచనలు ఇచ్చారు.

నిరుద్యోగులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి హయాంలో నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన పోయి ప్రజా పాలన వచ్చిందని అన్నారు. ఉపాధ్యాయ విద్యకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. టిడిపి హయాంలో 11 డిఎస్‌సిలు తీశారన్నారు. జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను అన్ని విధాలుగా మోసం చేశారని ఆరోపించారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, తదితరులు

సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయతీ పరిధి గుర్రంపేట గ్రామంలో ఎన్ఆర్‌ఈజిఎస్ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ వెట్టి లక్ష్మి, సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రేఖపల్లి నుండి నూతుగూడెంకు చుట్టు తిరిగి వెళితే 12 కిలోమీటర్లు వస్తుందని, గుర్రంపేటలో సిసి రోడ్డు నిర్మాణంతో ఐదు కిలోమీటర్లు మాత్రమే వస్తుందని చెప్పారు. గతంలో రైతులు పొలాలకు వెళ్లాలన్నా, మండలం నుండి ఎరువులు తెచ్చుకోవాలన్నా వాహనాలకు చాలా డబ్బు ఖర్చు అయ్యేదని, ఈ రోడ్డు వేయటం ద్వారా రైతులకు వాహనం ఖర్చు తగ్గనుందని పేర్కొన్నారు. ఈ మార్గం సరిగ్గా లేకపోవడంతో ప్రజలు, రైతులు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, వర్షాలు పడితే వాహనాలు తిరిగే పరిస్థితి ఉండేది కాదని, ఈ రోడ్డు నిర్మాణంతో పై సమస్యలన్నీ పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. సిసి రోడ్డును నాణ్యతతో నిర్మించాలని గుత్తేదారునికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన టిఎన్ఎస్ఎఫ్ నేత రాజ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయన్ను టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌రెడ్డి విద్యార్థులు సమస్యలు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్, కాస్మోటిక్ ఛార్జీలు, డీఎస్సీ నోటిఫికేషన్‌తో పాటు డీఎస్సీ కోచింగ్, మెటీరియల్, నిరుద్యోగ గిరిజన యువతకు ప్రోత్సహించడం వంటి సమస్యలను తెలియజేశారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో అవినీతిపై మంత్రి దృష్టి సారించాలని కోరారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు

పాఠశాలల్లో ఏజెన్సీ డిఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలం దేవరాతిగూడెం ఎంపీపీ పాఠశాలను ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పలు విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరాతిగూడెం పాఠశాలలో మొత్తం 16 మంది విద్యార్థులు చదువుతుండగా వారిలో మంగళవారం 15 మంది హాజరయ్యారని తెలిపారు. అనంతరం పాఠశాల అడ్మిషన్ల రికార్డులను, హాజరు పట్టీలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలలోనే ఉండాలని, అందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.